సాక్షి అనంతపురం

శుక్రవారం। 2। జూన్। 2023



టన్ను చీనీ రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి.



సైబర్ ఉచ్చులో పడొద్దు

ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తం చేసేందుకు పోలీసులు మొబైల్ హెల్త్‌క్యాంప్ నిర్వహించారు.

8లో



జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

పలకరించిన 'తొలకర్లు'



అనంతపురం అగ్రికల్చర్/గార్లదిన్నె/బొమ్మన హాళ్ : వ్యవసాయానికి శుభసూచికగా... 'ముంగారు' మొదలైన తొలిరోజే 'తొలకర్లు' పలకరించాయి. అన్నదాతకు ఆనందాన్నిచ్చేలా గురువారం మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమైంది. అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. రాయదుర్గం 44.6 మి.మీ, శెట్టూరు 26.2 మి.మీ, విడపనకల్లు, గుమ్మఘట్ట, పెద్దపప్పూరు, పామిడి, గార్లదిన్నె, అనంతపురం తదితర మరికొన్ని మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షపాతం నమోదైంది.

పలుచోట్ల పిడుగులు

గార్లదిన్నె మండలంలో ఉరుములు, మెరుపులతో గాలి, వాన బీభత్సం సృష్టించాయి. గార్లదిన్నెలో వడగండ్ల వాన పడింది. కల్లూరులో టెంకాయ చెట్టుపై పిడుగుపడింది. బొమ్మన హాళ్ మండలం ఉద్దేహాళ్‌లో పిడుగుపడి కొబ్బరి చెట్టు కాలిపోయింది.

సాంఘిక సంక్షేమశాఖ జేడీగా మధుసూదన్

అనంతపురం రూరల్: సాధారణ బదిలీల్లో భాగంగా సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్లు (జేడీలు), డిప్యూటీ డైరెక్టర్ల(డీడీల)ను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులోభాగంగా ఏలూరు జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న మధుసూదన్ రావును అనంతపురం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. .ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న విశ్వమోహన్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు.

నీటికుంటలో పడి ఇద్దరి మృతి



మృతి చెందిన కిరణ్, అంకప్ప

యల్లనూరు: ప్రమాదవశాత్తూ నీటికుంటలో మునిగి ఇద్దరు మృత్యువాత పడ్డారు. గడ్డంవారిపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన మేరకు... మల్లాగుండ్ల గ్రామానికి చెందిన ఎద్దు అంకప్ప(58)తో పాటు ఎనిమిదో తరగతి విద్యార్థి గిరిగారి కిరణ్(14), అశోక్ అనే వ్యక్తి గురువారం మధ్యాహ్నం సమీపంలోని గడ్డంవారిపల్లికి వెళ్లారు. ఎండల తీవ్రతకు గొంతు తడారడంతో ఓ రైతు పొలంలో ఏర్పాటు చేసిన నీటికుంట వద్ద నీరు తాగేందుకు వెళ్లారు. నీరు తాగే క్రమంలో కిరణ్ కాలుజారి కుంటలోపడ్డాడు. మునిగిపోతున్నాడని గుర్తించిన అంకప్ప కాపాడేందుకు నీటిలోకి దూకాడు. అయితే కుంట లోతు ఎక్కువగా ఉండటంతో కిరణ్‌తో పాటు అంకప్ప నీట మునిగారు. ఈ దృశ్యాన్ని చూసి భయకంపితుడైన అశోక్ పరుగున ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను తీసుకొచ్చాడు. అయితే అప్పటికే అంకప్ప, కిరణ్ మృతి చెందారు. అంకప్పకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఎస్‌ఐ రామకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కిరణ్ తండ్రి నారాయణస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూఏ పరిధిలో మేలో నిర్వహించిన బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–19) అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

అన్నదాతకు యంత్రసాయం

- వైఎస్సార్ యంత్ర సేవ కింద రెండో విడతగా 230 సీహెచ్‌సీలు
- రూ.23.15 కోట్లతో 169 ట్రాక్టర్లు, 1,163 సేద్యపు పరికరాలు
- ఇందులో 230 రైతుగ్రూపులకు రూ.8.05 కోట్ల సబ్సిడీ వర్తింపు
- నేడు ప్రభుత్వ ఆర్ట్సకళాశాల ఎదురుగా మెగామేళా



మెగా మేళాలో రైతుగ్రూపులకు మంజూరైన రాయితీ ట్రాక్టర్లు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న జగన్ సర్కారు వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద అన్నదాతలకు ట్రాక్టర్లు, ఆధునిక యంత్రపరికరాలు అందిస్తోంది. వ్యవసాయ, అనుబంధ రంగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ దేశంలో మరెక్కడా లేని విధంగా గ్రామ గ్రామానా రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకేలు) ఏర్పాటు చేసి రైతు ముంగిటకే ప్రభుత్వ ఫలాలు చేరుస్తోంది. ఆర్‌బీకేలకు అనుబంధంగా రైతు మిత్ర గ్రూపులు ఏర్పాటు చేసి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో 451 ఆర్‌బీకేలు ఉండగా... గతేడాది తొలివిడతగా 219 సీహెచ్‌సీలు ఇచ్చారు. ఇప్పుడు రెండో విడతగా 230 సీహెచ్‌సీలు కేటాయించారు.

నేడు మెగామేళా

అనంతపురం ప్రభుత్వ ఆర్ట్సకళాశాల ఎదురుగానున్న మైదానంలో శుక్రవారం 'మెగామేళా' ఏర్పాటు చేశారు. వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద రెండో విడతగా గ్రౌండ్ అయిన 230 సీహెచ్‌సీలకు ట్రాక్టర్లు, పరికరాలు ఇవ్వనున్నారు. ఒక్కో సీహెచ్‌సీకి రూ.15 లక్షలు విలువ చేసే కోరుకున్న ట్రాక్టర్‌తో పాటు ఆధునిక పరికరాలు కేటాయిస్తారు. ఇందులో లబ్ధిదారుల వాటా 10 శాతం, ప్రభుత్వం గరిష్ఠంగా రాయితీ 40 శాతం వర్తింపజేస్తుంది. మిగతా 50 శాతం సహకార బ్యాంకు ద్వారా రుణసాయం అందిస్తున్నారు. యూనిట్ గ్రౌండ్ అయిన తర్వాత 40 శాతం రాయితీ ప్రభుత్వం నుంచి గ్రూపు ఖాతాల్లోకి జమ చేస్తారు. ఇలా రెండో విడత కింద రూ.23.15 కోట్లు విలువ చేసే 169 ట్రాక్టర్లు, 1,163 సేద్యపు పరికరాలు, కంబైన్డ్ హార్వెస్టర్లు మంజూరు చేయనున్నారు. 230 సీహెచ్‌సీ గ్రూపులకు రూ.8.05 కోట్ల రాయితీ వర్తింపజేశారు. ఇక తొలివిడతగా గతేడాది 291 సీహెచ్‌సీ గ్రూపులకు రూ.8.15 కోట్ల రాయితీ జమ చేశారు.

కోరుకున్న మోడల్ ట్రాక్టర్లు

రైతులు కోరుకున్న కంపెనీ ట్రాక్టర్లకు రాయితీ ఇస్తున్నారు. ఇందులో పేరున్న 10 ప్రధాన కంపెనీలు, వాటికి చెందిన 140 వరకు మోడల్స్‌ను రైతులు ఎంపిక చేసుకోవచ్చు. అంటే మహీంద్రా, స్వరాజ్, సోనాలికా, ఐచర్, జాన్‌డీర్, ఎస్కార్ట్, టఫే, కుబోటో, వీఎస్‌టీ, ఇండోఫార్మ్, న్యూహాలెండ్ తదితర కంపెనీల ట్రాక్టర్లు ఉన్నాయి. మోడల్ ట్రాక్టర్లు, రొటావేటర్, మల్టీక్రాప్ త్రెషర్, కంబైన్డ్ హార్వెస్టర్లు, స్ప్రేయర్లు లాంటి సేద్యానికి ఉపయోగపడే ఆధునిక యంత్ర పరికరాలు ఇస్తుండటంతో రైతులకు చాలా వరకు మేలు జరుగుతోందని వ్యవసాయశాఖ అధికారి బి.చంద్రానాయక్ తెలిపారు.

రెవెన్యూ శాఖలో బదిలీలు

అనంతపురం అర్బన్: రెవెన్యూ శాఖలో 14 మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కలెక్టరేట్ పరిపాలనాధికారిగా (ఏ–సెక్షన్ సూపరింటెండెంట్) ఉన్న కె.విజయలక్ష్మి వ్యక్తిగత పనులపై రెండు నెలలు సెలవుపై వెళ్లనున్నారు. దీంతో ఆమెకు పోస్టింగ్ ఇవ్వలేదు. ల్యాండ్ రిఫార్మ్స్ తహసీల్దార్ కె.శ్రీధర్‌ను పరిపాలనాధికారిగా నియమించారు. అదే విధంగా గుమ్మఘట్ట తహసీల్దారు ఎం.వేణుగోపాల్‌ను అక్కడి నుంచి బదిలీ చేశారు. అయితే ఆయనకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. నార్పల తహసీల్దారు టి.నారాయణస్వామి సెలవు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. దీంతో తహసీల్దారు పూర్తి అదనపు బాధ్యతలను అక్కడి డిప్యూటీ తహసీల్దారుకు అప్పగించారు. కేఆర్‌ఆర్‌సీ, అనంతపురం స్పందన ఇన్‌చార్జ్ బి.వాణిశ్రీని కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయ డీఏఓగా, ఇక్కడ డీఏఓగా ఉన్న వై.భూషణం గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయానికి, రాప్తాడు తహసీల్దార్ బి.లక్ష్మీనాయక్ పెద్దపప్పూరుకు, పెద్దపప్పూరు తహసీల్దార్ షర్మిల ఆత్మకూరుకు, ఆత్మకూరు తహసీల్దార్ పి.నాగభూషణం పెద్దవడుగూరుకు, విడపనకల్లు తహసీల్దార్ ఎస్.బ్రహ్మయ్య గుమ్మఘట్టకు, బుక్కరాయసముద్రం తహసీల్దార్ కె.మోహన్‌కుమార్ పుట్లూరుకు, పుట్లూరు తహసీల్దార్ ఆర్.సుమతి యల్లనూరుకు, యల్లనూరు తహసీల్దార్ ఎస్.రమాదేవి బుక్కరాయసముద్రానికి, బెళుగుప్ప తహసీల్దార్ బి.ఈశ్వరయ్యశెట్టి కేఆర్‌ఆర్‌సీ, అనంతపురం స్పందన ఇన్‌చార్జ్‌గా బదిలీ చేశారు.

- అలాగే మరో 17 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 16 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, 62 మంది వీఆర్వోలను కూడా బదిలీ చేశారు.

రైతు క్షేమం.. సర్కారు లక్ష్యం



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తదితరులు

- జిల్లాకు రైతు భరోసా మొదటివిడత కింద రూ.216 కోట్లు
- ఇన్‌పుట్ సబ్సిడీ కింద మరో రూ.8.35 కోట్ల విడుదల
- నష్టపోయిన ప్రతిరైతునూ ప్రభుత్వం ఆదుకుంటుంది
- గ్రామ స్థాయిలోనే ఎరువులు, విత్తనాల పంపిణీ
- కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని కలెక్టర్ గౌతమి, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. గురువారం బుక్కరాయసముద్రం సచివాలయం దగ్గర జిల్లాస్థాయి రైతు సదస్సు నిర్వహించారు. వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ కింద వరుసగా ఐదో సంవత్సరం మొదటి విడతగా జిల్లాలోని 2,89,116 మంది రైతులకు విడుదలైన రూ.216.83 కోట్లు, ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన 5,311 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద విడుదలైన రూ.8.35 కోట్లకు సంబంధించిన మెగా చెక్కులను శింగనమల ఎమ్మెల్యే పద్మావతితో కలిసి కలెక్టర్ గౌతమి, ట్రైనీ కలెక్టర్ కుషాల్‌జైన్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. గతంలో రైతులు విత్తనాలు, ఎరువులు తీసుకోవాలంటే మూడు రోజుల పాటు మండల కేంద్రాలకు వెళ్లి క్యూలో ఎదురుచూడాల్సి వచ్చేదన్నారు. ఇలాంటి కష్టాలకు చెక్‌పెడుతూ సీఎం వైఎస్ జగన్ గ్రామస్థాయిలోనే ఆర్బీకే వేదికగా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, వ్యవసాయ శాఖ జేడీ చంద్రానాయక్, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, సర్పంచ్ పార్వతి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి హరినాథ్‌రెడ్డి, మత్స్యశాఖ డీడీ శాంతి, ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ లక్ష్మా నాయక్, ఏడీ వెంకటరాముడు, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తుది సీనియార్టీ జాబితా

- ముగిసిన అభ్యంతరాల పరిశీలన
- రాత్రి 11 గంటల వరకూ సాగిన ఉపాధ్యాయుల బదిలీల కసరత్తు



అభ్యంతరాలపై సిబ్బందితో మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడు రూరల్: ప్రభుత్వ టీచర్ల బదిలీలకు సంబంధించి ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాపై అందిన అభ్యంతరాలపై రెండు రోజులుగా సాగుతున్న పరిశీలన ప్రక్రియ గురువారం రాత్రి 11 గంటలకు ముగిసింది. ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాపై మొత్తం 731 అభ్యంతరాలు అందాయి. సైన్స్‌సెంటర్‌లో ప్రత్యేక బృందాలను నియమించి అభ్యంతరాలను పరిశీలన చేయించారు. ముందు రోజు అర్ధరాత్రి ఒంటిగంట వరకు పరిశీలన ప్రక్రియ సాగింది. రెండోరోజు రాత్రికి పూర్తయింది. డీఈఓ ఎం.సాయిరామ్ ప్రత్యేక పర్యవేక్షణలో అభ్యంతరాలను పరిశీలించారు. ఏ చిన్న సమస్య ఉత్పన్నం కాకుండా పలు మార్లు సిబ్బందిని డీఈఓ అప్రమత్తం చేస్తూ వచ్చారు. ఏ చిన్న అనుమానం వచ్చినా తనతో నివృత్తి చేస్తూ వచ్చారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీకి దరఖాస్తు చేసుకున్న ఇద్దరు హెచ్‌ఎంలు, ఇద్దరు టీచర్లపై కొందరు ఫిర్యాదులు చేశారు. అయితే ఆ ఇద్దరు జత చేసిన మెడికల్ సర్టిఫికెట్ల నిర్ధారణ కోసం జిల్లా విద్యాశాఖ అధికారి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు లేఖ పంపారు. అక్కడి నుంచి నిర్ధారణ వచ్చిన తర్వాత వీరిని ప్రిఫరెన్షియల్ కేటగిరీలో చేర్చాలా...వద్దా? అనేది నిర్ణయిస్తారు. కొందరు స్పౌజ్ పెట్టుకుంటామని అడిగారు. కొందరు అర్హత లేకున్నా వివిధ కేటగిరీల కింద పాయింట్లు పెట్టుకున్నారని ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి అర్హత ఉన్నవాటిని మాత్రమే పరిగణలోకి తీసుకుని పాయింట్లు కేటాయిస్తున్నామని డీఈఓ స్పష్టం చేశారు. కాగా దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు అర్హత సాధించిన పాయింట్లను జతచేసి శుక్రవారం ఫైనల్ సీనియార్టీ జాబితాను ప్రకటించనున్నారు. ఈనెల 4న ఖాళీల జాబితాను వెల్లడిస్తారు.

నర్సాపూర్-యశ్వంతపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నర్సాపూర్ – యశ్వంతపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న నర్సాపూర్ జంక్షన్ (07687) నుంచి మధ్యాహ్నం 3.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు (5వ తేదీ) ఉదయం 10.50 గంటలకు యశ్వంతపూర్ చేరుతుందని, అదే విధంగా 5వ తేదీ యశ్వంతపూర్ జంక్షన్ (07688) నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు బయలుదేరి 6వ తేదీ ఉదయం 8.30 గంటలకు నర్సాపూర్ చేరుతుందని పేర్కొన్నారు. పై తెలిపిన రోజుల్లో మాత్రమే ఈ రైళ్లు ప్రయాణిస్తాయని వారు స్పష్టం చేశారు.

మునిసిపల్ కమిషనర్ల బదిలీ

అనంతపురం క్రైం: జిల్లాలోని వివిధ మునిసిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లను బదిలీ చేస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. తాడిపత్రి మునిసిపల్ కమిషనర్‌గా వెయిటింగ్ జాబితాలో ఉన్న జి.రవిని, ధర్మవరం కమిషనర్ వి.మల్లికార్జునను గుంతకల్లుకు, అక్కడ పని చేస్తున్న శేషన్నను ధర్మవరానికి బదిలీ చేశారు. కర్నూలు నగరపాలక సంస్థలో కార్యదర్శిగా ఉన్న ఎస్ఎన్ లావణ్యను గుంతకల్లు అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. గుంతకల్లులో పని చేస్తున్న షేక్ మాలిక్‌ను కర్నూలు నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

రోగులకు అందుబాటులో ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయిదొర

పెద్దపప్పూరు: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో అందుబాటులో ఉండి రోగులకు వైద్యసేవలందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి దొర సిబ్బందికి సూచించారు. గురువారం యాడికి పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షా నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాసరెడ్డి, శ్రీరామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం ధ్యేయం



రాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత, పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

అనంతపురం అర్బన్: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే సీఎం జగన్ ధ్యేయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని రాజేంద్రనగర పాలక పాఠశాలలో బియ్యం కార్డుదారులకు రాగుల పంపిణీని వారు లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు నిర్వహించిన సభలో ఎమ్మెల్యే, కమిషనర్ మాట్లాడారు. ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా సీఎం పలు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఇప్పటికే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. అలాగే ప్రజలకు అత్యధిక పోషక విలువలున్న రాగులు, జొన్నల పంపిణీకి చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఎస్ఓ శోభారాణి, పౌర సరఫరాల సంస్థ డీఎం నీలమయ్య, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్ లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

సంతోషాలు నింపిన పెన్షన్ కానుక



అనంతపురం ఉమానగర్‌లో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాజు

అనంతపురం: వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారుల్లో సంతోషాన్ని నింపుతోంది. ప్రతి ఒనెలా ఒకటో తేదీనే వలంటీర్లు లబ్ధిదారుల తలుపుతట్టి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. అందులో భాగంగా గురువారం వేకువజామునుంచే పింఛన్ల పంపిణీ పండుగ ప్రారంభమైంది. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, నేతన్న, డప్పు కార్మికులు, చర్మకారులు ఒకటో తేదీనే అందిన పింఛన్ చూసి మురిసిపోయారు. జిల్లా వ్యాప్తంగా 2,74,128 మందికిగాను తొలిరోజు 2,20,000 మందికి పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. మిగిలిన వారికి కూడా పింఛన్ అందజేస్తామని అధికారులు తెలిపారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్.సి ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- జూన్ 4వ తేదీ ఉదయం 09:30 నుంచి 12:30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దాదాపు 1,000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation. com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్‌తో కలిసి జూన్ 4వ తేదీ ఉదయం 09:30 నుంచి 12:30 వరకు అనంతపురంలోని Ambedkar Convention Centre, Sai Nagar నందు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షి ఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికీ తెలిసిందే. హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబరుకు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ : జూన్ 4, 2023
వేదిక : అంబేద్కర్ కన్వెన్షన్ సెంటర్, సాయినగర్, అనంతపురం
సమయం : ఉదయం 09:30 నుంచి 12:30 వరకు

క్లుప్తంగా

సమ్మర్ స్పెషల్ ఒలింపిక్స్‌కు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న మాంచో ఫెర్రర్

అనంతపురం: ఈ నెల 12 నుంచి 28వ తేదీ వరకూ జర్మనీలోని బెర్లిన్‌లో జరిగే సమ్మర్ స్పెషల్ ఒలింపిక్స్‌కు అనంతపురం స్పోర్ట్స్ అకాడమీకి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ విభాగానికి సంబంధించి బ్యాడ్మింటన్ పోటీలకు డి.షమీలా, లోకేష్ నాసి, అలాగే టేబుల్ టెన్నిస్‌కు గుజ్జల అలివేలమ్మ, పవర్ లిఫ్టింగ్‌కు సుధామణి పూజారి ఎంపికయ్యారు. కోచ్ విభాగంలో పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఆశ దూదేకుల సయ్యద్, ఏహెడ్ విభాగం పవర్ లిఫ్టింగ్‌కు రాజశేఖర్ చెలి ఎంపికయ్యారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛోఫెర్రర్; డీఐడీ డైరెక్టర్ ఆర్. దశరథ రాముడు అభినందించారు.

పట్టు పరిశ్రమ శాఖలో బదిలీలు

అనంతపురం అగ్రికల్చర్: పట్టు పరిశ్రమ శాఖ పరిధిలో గురువారం ముగ్గురికి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి సెరికల్చర్ ఆఫీసర్ (ఎస్‌ఓ) శివకుమార్ అనంతపురం జేడీ కార్యాలయానికి, కళ్యాణదుర్గం నుంచి టెక్నికల్ అసిస్టెంట్ బాబయ్య శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి, ఇదే జిల్లా పెనుకొండ నుంచి టెక్నికల్ ఆఫీసర్ రమేష్‌మూర్తి కళ్యాణదుర్గానికి బదిలీ అయ్యారు.

సైబర్ ఉచ్చులో పడొద్దు

- డీఐజీ అమ్మిరెడ్డి
- అనంత వేదికగా మొబైల్ హెల్త్ చెకప్ క్యాంప్
- అందుబాటులో ఉచిత సేవలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వాసులకు డీఐజీ ఆర్.ఎస్.అమ్మిరెడ్డి పిలుపునిచ్చారు. సెల్‌ఫోన్లను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి అందులో డేటా ఆధారంగా వినియోగదారుల బ్యాంక్‌ల్లోని నగదు మాయం చేస్తుండడం బాధాకరమన్నారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్ల బారిన ప్రజలు పడకుండా అనంత వేదికగా మొబైల్ హెల్త్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతపురంలోని టవర్ క్లాక్ వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్ చెకప్ క్యాంప్‌ను ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారి మొబైల్‌లోని డేటా సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే అనేక మోసాలు చోటు చేసుకుంటాయన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలను కాపాడాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందన్నారు. మొబైల్ ఫోన్లలో మన ప్రమేయం లేకుండా చొరబడిన వైరస్‌ను తొలగించి, డేటాను సురక్షిత చేయాలనే లక్ష్యంతో సైబర్ కవచ్ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు వివరించారు. ఈ సేవలు పూర్తి ఉచితమని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్, కంప్యూటర్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు వాడే సమయంలో అనుకోకుండా మాల్‌వేర్ వచ్చే అవకాశముందన్నారు. దీంతో సిస్టం స్లోగా నడుస్తుందన్నారు. ఒక్కోసారి హ్యాక్ అవుతాయన్నారు. వైరస్ చేరిందని గుర్తిస్తే తొలగించవచ్చన్నారు. ఒక్కోసారి వైరస్‌ను గుర్తించే అవకాశముండదన్నారు. అలాంటి సందర్భాల్లో సైబర్ కవచ్ సేవలు ఎంతో ఉపయుక్తమవుతాయన్నారు. ఈ సేవలను గ్రామ స్థాయికి విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం వద్ద ఈ సేవలను సద్వినియోగం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు.





మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి (చిత్రంలో) ఎస్పీ కె.శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, మొబైల్ సేవలను సద్వినియోగం చేసుకుంటున్న వినియోగదారులు

అనూహ్య స్పందన

మొబైల్ హెల్త్ క్యాంప్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. 676 మంది తమ మొబైల్ ఫోన్లను స్కాన్ చేయించుకున్నారు. ఇందులో 186 రకాల వైరస్‌లను నిపుణులు గుర్తించి, తొలగించారు. మరో 518 మందికి వారికి తెలియకుండానే వారి పేర్లపై మరిన్ని సిమ్‌కార్డులు వినియోగంలో ఉన్నట్లు తేలింది. ఇందులో వినియోగదారుల అభ్యర్థన మేరకు అవసరం లేని సిమ్ కార్డులను నిపుణులు బ్లాక్ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్. విజయభాస్కరరెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు, డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, సీఐలు కత్తి శ్రీనివాసులు, ప్రతాప్ రెడ్డి, వెంకటేష్‌నాయక్, ఎంఎస్‌ఎం.టెక్నాలజీ ఎండీ మణికంఠ గౌతం, టెక్నికల్ వింగ్ ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్, ఆర్‌ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి, వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఉరవకొండ: మూడు రోజుల క్రితం స్థానిక ఇందిరానగర్‌లోని రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం ఉరవకొండ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ హరినాథ్, ఎస్‌ఐ వెంకటస్వామి వెల్లడించారు. గత నెల 28న ఇందిరానగర్‌లోని నజీర్, దయాకర్ ఇళ్లలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. మొత్తం 21తులాల బంగారంతో పాటు 30 తులాల వెండి, రూ.లక్ష నగదు అపహరణకు గురైంది. ఈ కేసును సవాల్‌గా స్వీకరించిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితుడు గుంతకల్లుకు చెందిన షికారి రాజుగా గుర్తించారు. ఈ క్రమంలో రాజు కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు గురువారం ఉదయం నగలను విక్రయించేందుకు బళ్లారికి వెళుతుండగా ఉరవకొండ మార్కెట్ యార్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 8 తులాల బంగారం, అర కిలో వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, నిందితుడు రాజుపై జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో 11 కేసులు ఉన్నట్లుగా సమాచారం.

మొలకలపెంటను సందర్శించిన వైద్యాధికారులు



రోగికి చికిత్స చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి

గుంతకల్లు రూరల్: మండలంలోని మొలకలపెంటలో ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి పేర్కొన్నారు. మొలకలపెంటలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుందన్న ప్రచారం జోరుగా సాగిన నేపథ్యంలో డీఎంహెచ్‌ఓతో పాటు, డీపీఎంఓ డాక్టర్ చెన్నకేశవులు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు, డీఈఎంఓ త్యాగరాజు తదితరులు గురువారం ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ రకాల జబ్బులతో బాధ పడుతున్న వారి ఇళ్ల వద్దకెళ్లి, వారి వైద్య పరీక్షలకు సంబంధించిన రిపోర్టులను పరిశీలించారు. గ్రామస్తులతో డాక్టర్ వీరబ్బాయి మాట్లాడుతూ.. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

ఎంపీడీఓలకు స్థాన చలనం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 మందికి స్థానాల కేటాయింపు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని 24 మంది ఎంపీడీఓలకు స్థాన చలనం కలిగింది. వారిలో రెగ్యులర్ ఎంపీడీఓలు ఆరుగురు ఉండగా, పదోన్నతి పొందిన పరిపాలనాధికారులు, ఈఓఆర్‌డీలు 18 మందికి పోస్టింగ్ ఇస్తూ జిల్లా పరిషత్ అధికారులు గురువారం రాత్రి 8.30 గంటలకు ఉత్తర్వులు జారీ చేశారు. కళ్యాణదుర్గం ఎంపీడీఓ ఎం.కొండన్నను నల్లమాడకు, బెళుగుప్ప నుంచి యాదవేంద్రను గాండ్లపెంటకు, చెన్నేకొత్తపల్లి నుంచి వి.సరస్వతిని పరిగికి, కనగానపల్లి నుంచి టి.లక్ష్మీనారాయణను యాడికికి, రొళ్ల నుంచి డి.రామారావును గుడిబండకు, రామగిరి నుంచి కె.ఆజాద్‌ను రొళ్లకు బదిలీ చేశారు. పదోన్నతిపై మరో ప్రాంతానికి బదిలీ అయిన వారిలో శెట్టూరుకు పి.మైథిలి (చెన్నేకొత్తపల్లి), బెళుగుప్పకు జీఎస్ రామచంద్ర (ధర్మవరం), గుమ్మఘట్టకు ఎస్.నరసింహమూర్తి (మడకశిర), కళ్యాణదుర్గానికి ఐ.సాల్మన్ (నంద్యాల), అనంతపురం రూరల్‌కు వై.పుల్లయ్య (నంద్యాల), గుంతకల్లుకు సి.వెంకటరమణప్ప (కర్నూలు), యల్లనూరుకు బి.వీర్రాజు (కర్నూలు), బ్రహ్మసముద్రం మండలానికి ఎస్.దాసానాయక్ (కర్నూలు), కుందుర్పికి కె.విజయశేఖర్‌రావు (కర్నూలు), కంబదూరుకు ఎం.సుధాకర్‌రాజు (కర్నూలు), బుక్కపట్నానికి పి.కృష్ణమోహన్‌బాబు (అనంతపురం), ఓబుళదేవరచెరువుకు కె.వరలక్ష్మి (కర్నూలు), కనగానపల్లికి టి.అలివేలమ్మ (అనంతపురం), చెన్నేకొత్తపల్లికి ఎస్.గంగావతి (అనంతపురం), తాడిమర్రికి బి.విజయలక్ష్మి (బత్తలపల్లి), తలుపులకు బి.కిరణ్‌మోహన్‌రావు (వైఎస్సార్ జిల్లా) ఉన్నారు.

పిడుగుపాటుకు గొర్రెలు మృతి

బెళుగుప్ప: పిడుగుపాటుకు మూడు గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన మేరకు.. బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన రైతు ఎర్రిస్వామి గురువారం ఉదయం తన గొర్రెలను శీర్పి రహదారి వైపు మేపునకు తోలుకెళ్లాడు. సాయంత్రం వర్షంతో పాటు పిడుగు పడడంతో మూడు గొర్రెలు మృతి చెందాయి. దీంతో రూ.30 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

10 మంది ట్రెజరీ ఉద్యోగుల బదిలీ

అనంతపురం అర్బన్: ఖజానా (ట్రెజరీ) శాఖలో 10 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ డిప్యూటీ డైరెక్టర్ జె.సరళా విజయకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని సబ్ ట్రెజరీలు (ఎస్‌టీ), డివిజనల్ సబ్ ట్రెజరీ (డీఎస్‌టీ), జిల్లా ట్రెజరీలో (డీటీ) విధులు నిర్వర్తిస్తున్న ఆరుగురు సీనియర్ అకౌంటెంట్లు (ఎస్‌ఏ), నలుగురు ఆఫీస్ సబార్డినేట్లను (ఓఎస్) బదిలీ చేశారు.

బదిలీలు ఇలా...

పేరు- హోదా	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.గంగాధర్‌గౌడ్, ఎస్‌ఏ	గుంతకల్లు ఎస్‌టీ	రాయదుర్గం ఎస్‌టీ
ఆర్.తిమ్మప్ప, ఎస్‌ఏ	మడకశిర ఎస్‌టీ	హిందూపురం ఎస్‌టీ
ఎన్.ఖాదర్‌జిలాన్, ఎస్‌ఏ	హిందూపురం ఎస్‌టీ	జిల్లా ఖజానా, అనంతపురం
ఎస్.ముస్తక్ మహమ్మద్, ఎస్‌ఏ	జిల్లా ఖజానా	తాడిపత్రి, ఎస్‌టీ
ఎమ్.సుజాత, ఎస్‌ఏ	రాయదుర్గం ఎస్‌టీ	గుంతకల్లు ఎస్‌టీ
వై.పద్మావతి, ఎస్‌ఏ	తాడిపత్రి ఎస్‌టీ	జిలా ఖజానా, అనంతపురం
కె.మహబూబ్‌బీ, ఓఎస్	పెనుకొండ, డీఎస్‌టీ	జిల్లా ఖజానా, పుట్టపర్తి
సి.వెంకటేశులు, ఓఎస్	జిల్లా ఖజానా, అనంతపురం	గుత్తి, ఎస్‌టీ
టి.నారాయణప్ప, ఓఎస్	గుత్తి, ఎస్‌టీ	పెనుకొండ, డీఎస్‌టీ
పి.వెంకటరమణ, ఓఎస్	కొత్తచెరువు ఎస్‌టీ	జిల్లా ఖజానా, అనంతపురం

గుత్తి సీడీపీఓగా దిల్లీశ్వరి



గుత్తి: గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏసీడీపీఓ దిల్లీశ్వరికి ఇదే స్థానంలో సీడీపీఓగా పదోన్నతి కల్పిస్తూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, ఈ స్థానంలో సీడీపీఓగా పనిచేస్తున్న నాగమణిపై అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో ఆమెకు ఏసీడీపీఓగా డిమోషన్ ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రైతాంగానికి దన్నుగా నిలిచిన ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: వ్యవసాయమే దండగా అంటూ రైతులను చంద్రబాబు నట్టేట ముంచితే.. అదే వ్యవసాయాన్ని పండుగ చేసి రైతులకు దన్నుగా సీఎం వైఎస్ జగన్ నిలిచారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య కొనియాడారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదోసారి రైతు భరోసా విడుదల చేయడంపై జిల్లా రైతుల తరఫున సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతు భరోసా అందించడంపై మండల కేంద్రాల్లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం, కేక్ కట్టింగ్ కార్యక్రమాలతో సంబరాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రూ.4వేల కోట్ల లబ్ధిని చేకూర్చారన్నారు. ఇందులో జిల్లాకు సంబంధించి 2,87,695 మందికి రూ.216 కోట్లు విడుదల చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, మినీ ట్రాక్టర్లను పారదర్శకంగా అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. 2014 ఎన్నికలకు ముందు అప్పటికే పేరుకుపోయిన రైతు రుణాలు రూ.85 కోట్లు మాఫీ చేస్తానని ప్రకటించిన చంద్రబాబు.. అధికారం చేపట్టిన తర్వాత కేవలం నామమాత్రంగా మాఫీ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రాజారాం, జిల్లా అధ్యక్షుడు ఎన్వీ నారాయణ మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా సకాలంలో రైతులను ఆదుకోవడం గొప్ప విషయమన్నారు.

తపాలా శాఖలో బదిలీల షెడ్యూల్ విడుదల

అనంతపురం సిటీ: తపాలా శాఖలో పని చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగుల సాధారణ బదిలీల షెడ్యూల్‌ను ఆ శాఖ ఉన్నతాధికారులు గురువారం విడుదల చేశారు. ఈ నెల 7వ తేదీ వరకు ఖాళీల వివరాలు ప్రకటన, 10 నుంచి 18వ తేదీ వరకూ బదిలీలకు సంబంధించి రిజిస్ట్రేషన్, దరఖాస్తుల సమర్పణ, 19 నుంచి 20వ తేదీ వరకూ ఆప్షన్ల నమోదు ఉంటుంది. 21 నుంచి 24వ తేదీ వరకూ దరఖాస్తుల పరిశీలన, 27న కౌన్సెలింగ్ అనంతరం జూలై 15లోపు బదిలీ అయిన ప్రదేశంలో ఉద్యోగులు విధుల్లో చేరాల్సి ఉంటుంది.

ఘర్షణ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

బుక్కరాయసముద్రం: ఘర్షణ కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి సుజన్‌కుమార్ తీర్పు వెలువరించారు. ఈ మేరకు బీకేఎస్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2017, మార్చిలో పొలం గట్టు వద్ద బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లికి చెందిన మహేశ్వరిపై అదే గ్రామానికి చెందిన బుల్లే చిరంజీవి కట్టెతో దాడి చేశాడు. దీనిపై అప్పట్లో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచారు. అప్పటి నుంచి వాదనలు జరుగుతూ వచ్చిన ఈ కేసు తుది తీర్పు గురువారం వెలువడింది. నేరం రుజువు కావడంతో ముద్దాయి చిరంజీవికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

పలువురు పీఆర్ ఇంజినీర్ల బదిలీ

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న 10 మంది ఇంజినీర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ) భాగ్యరాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే కేటాయించిన స్థానాల్లో చేరిపోవాలని ఆదేశించారు.

ఐసీడీఎస్‌లో....

అనంతపురం సెంట్రల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఐసీడీఎస్‌లో జూనియర్ అసిస్టెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, గ్రేడ్-2 సూపర్‌వైజర్లు, గ్రేడ్-1 సూపర్‌వైజర్లకు గురువారం ఉదయం బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. హిందూపురంలో పనిచేస్తున్న సుశీలాసౌభాగ్యవతిని సోమందేపల్లికి, తాడిపత్రి నుంచి రాజేశ్వరిని బత్తలపల్లికి, అనంతపురంలో పనిచేస్తున్న భారతీ దేవిని పుట్టపర్తికి, సత్యవేడులో పనిచేస్తున్న సంధ్యాని పుట్లూరుకు, మడకశిర నుంచి అరుణమ్మను ఉరవకొండకు, కూడేరులో పనిచేస్తున్న లీలావతి, హేమలత, మడకశిర నుంచి లావణ్య, కోయిలకుంట్ల నుంచి శ్రీవాణిని అనంతపురం రూరల్‌కు, కూడేరు నుంచి నేతాజీబీని బత్తలపల్లికి, కదిరి జయమ్మను నల్లచెరువుకు, కదిరి వెస్ట్ నుంచి సత్యవతి, గంగాదేవిని ఓడీచెరువుకు బదిలీ చేశారు.

జేడీఏగా ఉమామహేశ్వరమ్మ



అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీఏ)గా యు.ఉమామహేశ్వరమ్మ నియమితులయ్యారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జేడీఏగా పనిచేస్తున్న ఆమెను సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురానికి బదిలీ చేస్తూ వ్యవసాయ శాఖ కమిషనరేట్ నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ జేడీఏగా పనిచేస్తున్న బి.చంద్రానాయక్‌ను ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేశారు. ఇద్దరు డీడీఏలు, ఐదుగురు ఏడీఏలు, 19 మంది ఏఓలను బదిలలీ చేశారు. అలాగే ఉద్యానశాఖ, పశుసంవర్ధకశాఖ పరిధిలో కూడా బదిలీలు జరిగాయి. పశుసంవర్ధకశాఖ పరిధిలో హిందూపురం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ హోదాలో ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ ఎన్.శుభదాస్‌కు పూర్తీ స్థాయి జిల్లా అధికారిగా బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే డిప్యూటేషన్ కింద ఉరవకొండలో పనిచేస్తున్న శశికళ అనంతపురం రూరల్ ఏఓగా బాధ్యతలు తీసుకోనున్నారు.

ఉద్యానశాఖ పరిధిలో...

హెచ్‌ఓ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.చందన	అనంతపురం డీడీ ఆఫీసు	ఆత్మకూరు (నంద్యాల)
బీసీ ధనుంజయ	కళ్యాణదుర్గం	అనంతపురం డీడీ ఆఫీసు
డి.దస్తగిరి	రాయదుర్గం	పత్తికొండ (కర్నూలు)
ఎస్.ప్రతాప్‌రెడ్డి	మొలకలచెరువు	కదిరి
ఎస్.నవీన్‌కుమార్	కదిరి	పుట్టపర్తి
చంద్ర (అడ్మినిస్ట్రేటివ్)	అనంతపురం	కడప
బాషా (అడ్మినిస్ట్రేటివ్)	కడప	అనంతపురం

ఆత్మహత్య కాదు.. ప్రేరేపిత హత్య

- అదనపు కట్నం వేధింపులే కారణమన్న మృతురాలి తండ్రి
- రైల్వే ఎలక్ట్రికల్ జేఈపై కేసు నమోదు

గుంతకల్లు టౌన్: అదనపు కట్నం కోసం తమ కుమార్తెను వేధించి చివరకు ఆత్మహత్య చేసుకునేలా అల్లుడే ప్రేరేపించాడంటూ మృతురాలి తండ్రి కన్నీటి పర్యంతమయ్యాడు. దీంతో మృతురాలి భర్తపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య గురువారం వెల్లడించారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా వి.వెంకటంపల్లి గ్రామానికి చెందిన భిక్షం కుమారుడు రవి... గుంతకల్లులోని పీఅండ్‌టీ కాలనీలో నివాసముంటూ రైల్వే ఎలక్ట్రికల్ జేఈగా పనిచేస్తున్నాడు. మూడేళ్ల క్రితం ఖమ్మం జిల్లా నెలకొండపల్లి మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన బి.వెంకటేశ్వరరావు కుమార్తె రుక్మిణితో ఆయనకు వివాహమైంది. పెళ్లి సమయంలో కట్న కానుకల కింద రూ.10 లక్షల నగదు, 15 తులాల బంగారం, 250 గజాల ఇంటి స్థలం, 20 కుంటల పొలాన్ని రుక్మిణి తల్లిదండ్రులు అందజేశారు. పెళ్లి అనంతరం గుంతకల్లులో తాను అద్దెకు ఉంటున్న ఇంటికి రవి మకాం మార్చాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం వీరికి ఓ బాబు పుట్టాడు. ప్రస్తుతం రుక్మిణి రెండు నెలల గర్భిణి. ఇటీవల అదనపు కట్నం కోసం రుక్మిణిని భర్త వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. ఆమెను పుట్టింటికి పంపకుండా, వారితో మాట్లాడకుండా కట్టడి చేశాడు. బుధవారం ఉదయం రుక్మిణితో గొడవ పడిన రవి ఆమె తండ్రికి ఫోన్ చేసి రుక్మిణిని పిలుచుకెళ్లాలని తెలిపి, ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన రుక్మిణి తన ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త వేధింపులు తాళలేకనే తమ కుమార్తె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు రుక్మిణి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూటీ డిక్కీలోని రూ.8 లక్షల అపహరణ

ఉరవకొండ: స్కూటీ డిక్కీలో ఉంచిన రూ.8 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. బాధితుడు రామన్న, పోలీసులు తెలిపిన మేరకు.. ఉరవకొండ మండలం వెలిగొండ గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి తలారి రామన్న, గురువారం ఉదయం తన కొడుకు చెన్నకేశవతో కలసి ఉరవకొండలోని కెనరా బ్యాంకుకు నగదు డ్రా చేసేందుకు వచ్చాడు. 11 గంటలకు రూ.8 లక్షలు డ్రా చేసి ఓ టవాల్‌లో చుట్టి స్కూటీ డిక్కీలో ఉంచారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని వాహనాన్ని బయటే ఉంచి డాక్యుమెంట్ రైటర్ కొమ్మసాని బాలచంద్ర కోసం లోపలకు వెళ్లి ఆరా తీశారు. అతను లేకపోవడంతో వెనక్కు వచ్చి స్కూటర్ వద్దకు చేరుకోగా డిక్కీ తెరిచి ఉన్నట్లుగా గుర్తించారు. అందులో ఉంచిన నగదు కనిపించలేదు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో సీఐ హరినాథ్, ఎస్‌ఐ వెంకటస్వామి అక్కడకు చేరుకుని ఆరా తీశారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ఏడీఏగా రవి



రవికి శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యాన వర్సిటీ బోర్డు మెంబర్, డీలర్ల అసోసియేషన్ సభ్యులు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ అనంతపురం సబ్‌డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ)గా మీనల రవి గురువారం బాధ్యతలు చేపట్టారు. గురువారం ఉదయం కమిషనరేట్ నుంచి బదిలీ ఉత్తర్వులు రాగానే కనేకల్లు ఫారం ఏడీఏగా ఉన్న ఎం.రవి అక్కడి నుంచి వెంటనే రిలీవ్ అయ్యారు. సాయంత్రం స్థానిక ఏడీఏ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడున్న ఏడీఏ ఎం.వెంకటరాముడు గుత్తి డివిజన్‌కు బదిలీ అయ్యారు. నూతన ఏడీఏ ఎం.రవికి ఏఓలు వెంకటేశ్వరప్రసాద్, సోమశేఖర్, శుభకర్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ బోర్డు మెంబర్ గద్దె కేశవరెడ్డి, డీలర్ల అసోసియేషన్ నాయకులు సురేష్‌కుమార్‌రెడ్డి, శిరిగుప్ప వెంకటేశ్వర్లు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

వాసవీ మాతా నమోస్తుతే



అలంకరణలో కన్యకాపరమేశ్వరి

ఆత్మకూరు: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం అమ్మవారికి పూజా కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఆర్య వైశ్య మహిళలచే కుంభాలను ఊరేగించారు. అనంతరం గంగానయనం, గోపూజ, గణపతి పూజ, దేవనంది, పంచగవ్యం, కలశస్థాపన, నవగ్రహ తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠ , దీక్షా హోమం, సుదర్శన హోమం, పూజలతో పాటు అమ్మవారికి మహా మంగళహారతి ఇచ్చారు.

39 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ఎస్కేయూ రెక్టార్ , రిజిస్ట్రార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 39 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎపిసోర్స్ కంపెనీ మెడికల్ కోడింగ్ జాబ్‌కు సంబంధించి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎస్కేయూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు 95 మంది హాజరయ్యారు. ఇందులో 39 మందికి ఉద్యోగాలు దక్కాయి. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ వరలక్ష్మి పర్యవేక్షణలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులను ఎస్కేయూ రెక్టార్ ఏ. మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య అభినందించారు.

స్కూల్ అసిస్టెంట్ సస్పెన్షన్

రాప్తాడురూరల్: విధులను నిర్లక్ష్యం చేసిన బెళుగుప్ప మండలం వెంకటాద్రిపల్లి జెడ్పీహెచ్ఎస్ గణితం స్కూల్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈఓ సాయిరామ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఆయన డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఉన్నారు. రెండు రోజుల కిందట జిల్లా కేంద్రం నుంచి ప్రశ్నపత్రాలు, ఇతర కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ పోలీస్‌స్టేషన్లకు పంపారు. చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్ట్‌మెంటల్ అధికారి దగ్గరుండి ఈ మెటీరియల్‌ను రిసీవ్ చేసుకోవాల్సి ఉంది. అయితే శ్రీనివాసరెడ్డి మాత్రం ఆ సమయంలో పోలీస్‌స్టేషన్ వద్దకు రాలేదు. చీఫ్ సూపరింటెండెంట్ అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు తప్ప విధులకు హాజరుకాలేదు. దీనిపై డీఈఓ సాయిరామ్‌కు సీఎస్ ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన డీఈఓ సదరు టీచర్‌పై సస్పెండ్ వేటు వేశారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం



హారిక (ఫైల్)

రాప్తాడురూరల్: డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై గురువారం అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ నందమూరినగర్‌కు చెందిన రామాంజనేయులు కూతురు హారిక నగరంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గత నెల 29న ఉదయం ఇంట్లో నుంచి కళాశాలకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అన్ని చోట్లా గాలించినా ఫలితం లేదు. దీంతో వారు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆనందమని పింఛన్

- తెల్లవారుజామునుంచే సామాజిక పింఛన్ల పంపిణీ
- ఠంచన్‌గా పింఛన్ అందడంపై లబ్ధిదారుల హర్షం
- నగరంలో 18,386 మందికి పంపిణీ



హౌసింగ్‌బోర్డులో లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: తెల్లవారముందే తలుపుతట్టి మరీ పింఛన్ డబ్బులు అందజేయడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మురిసిపోయారు. తమ బాధలు తెలుసుకొని 1వ తేదీనే ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మేలును మరువలేమని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో ఉన్న 22,553 లబ్ధిదారులకుగాను 18,386 మందికి రూ.5,16,27,500 (5.16 కోట్లు) పింఛన్‌ను పంపిణీ చేశారు. ఇక కేవలం 4167 మందికి మాత్రమే పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంది. నగరంలోని 32వ డివిజన్‌లో మేయర్ వసీం పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్ అందించి, ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. పింఛన్‌ను సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు మేయర్ వసీం తెలిపారు. గత ప్రభుత్వంలో పింఛన్ కోసం నగరపాలక సంస్థ చుట్టూ ప్రదక్షిణ చేసే దౌర్భాగ్య పరిస్థితులుండేవన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి నెలా 1న ఉదయం 5 గంటల నుంచే పింఛన్ పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్ భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు ఖాజా, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, కోనారాజారెడ్డి, తదితరుల పాల్గొన్నారు.

కనగానపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జోరుగా సాగుతున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో తొలిరోజు సుమారు 85 శాతం పింఛన్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా గురువారం వలంటీర్లు లబ్ధిదారులకు తెల్లవారుజామునుంచే పింఛన్‌ను పంపిణీ చేశారు. గతంలో పింఛన్ కోసం ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లమని, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు ఇబ్బందులు లేకుండా గ్రామ వలంటీర్ల ద్వారా ఇళ్ల దగ్గరకే వచ్చి పింఛన్ అందిస్తుండటం హర్షణీయమన్నారు.



కనగానపల్లి: వృద్ధురాలికి పింఛన్ డబ్బు అందజేస్తున్న వలంటీర్



ఆత్మకూరు: పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మి

నీలం సంజీవరెడ్డికి ఘన నివాళి

అనంతపురం టవర్‌క్లాక్: దివంగత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతిని గురువారం స్థానిక శ్రీకంఠం సర్కిల్‌లో ఏడీసీసీబ్యాంకు మాజీ చైర్మన్ తరిమెల కోనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నీలం సంజీవరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జికి నీలం సంజీవరెడ్డి పేరు పెట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమణ, వెన్నపూస రామచంద్రారెడ్డి, నీలకంఠేశ్వర, ఆదిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, దస్తగిరి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

4న సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం 77వ జయంతి వేడుకలను ఈనెల 4న నిర్వహిస్తున్నట్లు పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి అధ్యక్షుడు సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక అనంతపురం క్లబ్ ప్రాంగణంలో జరిగే సంగీత విభావరి కార్యక్రమంలో కళాకారులతో పాటు ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఆర్టీసీ సీటీఎంగా రమేష్‌బాబు

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ఆర్టీసీ డిప్యూటీ సీటీఎంగా రమేష్‌బాబు నియమితులయ్యారు. వైఎస్సార్ జిల్లా నుంచి ఆయన బదిలీపై జిల్లాకు రానున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ సీటీఎం శివకుమార్‌ను కడపకు బదిలీ చేశారు.

ఆర్ఓబీకి నీలం సంజీవరెడ్డి పేరు పెట్టాలి

అనంతపురం టవర్‌క్లాక్: నగరంలోని టవర్‌క్లాక్ వద్ద నిర్మించిన నూతన ఫ్లైఓవర్ బ్రిడ్జికి దివంగత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి పేరును పెట్టాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్ కుమార్‌రెడ్డి కోరారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక శ్రీకంఠం సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగలకుంట నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో పుట్టిన నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. ఆయన ఆలోచన విధానంతో దేశంలో, రాష్ట్రంలో ఎన్నో మార్పులు చేశారని వాటిద్వారా పేదల బతుకులు మారాయన్నారు. గతంలో టవర్‌క్లాక్ బ్రిడ్జికి నీలం సంజీవరెడ్డి పేరు ఉందని, అలాగే నూతన బ్రిడ్జికి కూడా ఆయన పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో బయపురెడ్డి, నాగేశ్వర రెడ్డి, సూర్యచంద్రరెడ్డి, ఆదికేశవరెడ్డి, శ్రావణ్ కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాపాయ కేసులను నిర్లక్ష్యం చేయద్దు

- సీఎంఓలను ఆదేశించిన సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ రఘునందన్



సీఎంఓలకు సూచనలిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్

అనంతపురం క్రైం: 'ఎమర్జెన్సీ వార్డుకు వచ్చే ప్రాణాపాయ కేసులను నిర్లక్ష్యం చేయద్దు. బాధ్యతగా సకాలంలో అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌కు తరలించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవు' అని క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లను (సీఎంఓ) సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ హెచ్చరించారు. గురువారం ఆస్పత్రిలో సీఎంఓలతో సూపరింటెండెంట్ సమావేశమయ్యారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న కేసులు ఎమర్జెన్సీకి వచ్చినప్పుడు ఏఎంసీ ఇన్‌చార్జ్‌లు డాక్టర్ నూరల్ల, కళ్యాణ్ రామ్‌లకు సకాలంలో సమాచారం అందించాలన్నారు. ఆర్థో, ఈఎన్‌టీ, సర్జికల్, తదితర విభాగాలకు చెందిన కేసులను ఆయా డ్యూటీ వైద్యులకు సమాచారం ఇచ్చి, తక్షణం వార్డుకు తరలించాలన్నారు. గంటల తరబడి ఎమర్జెన్సీ వార్డులో ఉంచకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్టాఫ్ నర్సులు, ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ విధులపై నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల మధ్యలో సీఎంఓలు అందుబాటులోకి రాకపోవడంపై సూపరింటెండెంట్ అసహనం వ్యక్తం చేశారు. కచ్చితంగా సమయపాలన పాటించాలని, ఏదైనా అత్యవసరమై బయటకు వెళ్లాల్సి వస్తే రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్(ఆర్ఎంఓ)లకు సమాచారం ఇవ్వాలన్నారు. పీజీ స్పెషలైజేషన్ చేసిన సీఎంఓలను తిరిగి ఎమర్జెన్సీ వార్డుల్లో పని చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అందరికీ పారదర్శకంగా విధులను కేటాయించడం జరుగుతుందన్నారు.

ఎంఎల్‌సీ కేసులపై అప్రమత్తంగా ఉండాలి

మెడికో లీగల్ కేసు (ఎంఎల్‌సీ)పై అప్రమత్తంగా ఉండాలన్నారు. 30 నుంచి 40 శాతం శరీరం కాలిపోయిన కేసులను ఎంఎల్‌సీగా నమోదు చేయాలన్నారు. కిందపడ్డాను, ప్రమాదవశాత్తూ జరిగాయని చెప్పే ఏఆర్ (ఆక్సిడెంటల్ రిజిస్టర్) కేసులపై లోతుగా ఆరా తీయాలన్నారు. బ్రాట్ డెత్ కేసుల రికార్డులను పక్కాగా నమోదు చేసి, మృతదేహాన్ని మార్చురీకి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్టర్ ఎంఎల్‌సీ (ఆర్ఎంఎల్‌సీ) కేసులను మళ్లీ ఎంఎల్‌సీ చేయాలన్నారు. విధి నిర్వహణలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తక్షణం ఆర్ఎంఓలకు సమాచారం ఇవ్వాలన్నారు. రోగులకు ఉత్తమ సేవలందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ఆర్ఎంఓలు డాక్టర్ అభిషేక్, డాక్టర్ సునీత, సీఎంఓలు డాక్టర్ రజిత, డాక్టర్ నీలూఫర్, డాక్టర్ మాధురి, డాక్టర్ రీనాకుమారి, డాక్టర్ మహేష్, డాక్టర్ కిషోర్, డాక్టర్ జనార్దన్, డాక్టర్ శ్రీనివాస్ నాయక్, డాక్టర్ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లా డీఈఓకు పరామర్శ



మీనాక్షిని పరామర్శిస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి ఎడమ మోకాలు వద్ద ఎముకలు విరిగినట్లు వైద్యులు ధ్రువీకరించారని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ వెల్లడించారు. గురువారం శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం నసనకోట సమీపంలో శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ మీనాక్షి ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో డీఈఓతో పాటు రామగిరి మండల విద్యాశాఖ అధికారి గోపాల్ గాయపడ్డారు. వీరిని హుటాహుటిన అనంతపురం నగర శివారులోని సవీరా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే అనంతపురం కలెక్టర్ గౌతమి, సత్యసాయి కలెక్టర్ అరుణ్‌కుమార్ ప్రత్యేకంగా వైద్యులకు ఫోన్లు చేసి మాట్లాడారు. డీఈఓ మీనాక్షి, ఎంఈఓ గోపాల్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆస్పత్రికి వెళ్లి ప్రత్యక్షంగా పరామర్శించారు. వైద్యులతో మాట్లాడారు. మీనాక్షికి ఎడమ మోకాలు వద్ద ఎముకలు విరిగాయని తప్పనిసరిగా శస్త్రచికిత్స చేయాల్సి ఉందని వైద్యులు తెలియజేశారు. తలకు పెద్ద గాయాలు లేవని డీఈఓ తెలిపారు. ఎంఈఓకు నుదిటపై పడిన గాయానికి కుట్లు వేయాలని వైద్యులు తెలియజేశారు.

టౌన్ ప్లానింగ్ ఆర్‌డీగా సంజీవ్ కుమార్

అనంతపురం క్రైం: టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆర్‌డీగా సంజీవ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప నగరపాలక సంస్థ డీసీపీగా ఉన్న ఆయన బదిలీపై జిల్లాకు రానున్నారు. అలాగే ఇక్కడ పని చేస్తున్న టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆర్‌డీ దేవికుమారి తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(తుడా)లో ప్లానింగ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఇస్మాక్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన గుంతకల్లు ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఏసీపీ బదిలీలు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లుగా ఉన్న శ్రీనివాసులురెడ్డి, కే సువర్ణలను బదిలీ చేస్తూ గురువారం డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఏసీపీ సువర్ణను కర్నూలు నగర పాలక సంస్థ డిస్ట్రిక్ట్ టౌన్ అండర్ కంట్రీప్లానర్ (డీటీసీపీ)గా, శ్రీనివాసులురెడ్డిని తిరుపతికి బదిలీ అయ్యారు. ఇదిలా ఉండగా ఏసీపీ సువర్ణను కమిషనర్ రమణారెడ్డి ఆగమేఘాలపై రిలీవ్ చేశారు. ఆమె బాధ్యతలను బిల్డింగ్ సూపర్‌వైజర్ మహబూబ్‌జాన్‌కు అప్పజెప్పినా..ఆమె గుత్తి బిల్డింగ్ సూపర్‌వైజర్‌గా నియమితులైనట్లు సమాచారం. ఏసీపీ శ్రీనివాసులురెడ్డి సెలవులో ఉండడంతో ఆయన్ను రిలీవ్ చేయలేదు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

- పౌర సరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్



ఆలమూరు లే అవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న పౌర సరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్

అనంతపురం క్రైం: ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని పౌర సరఫరా కమిషనర్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆలమూరు లే అవుట్‌ను ఆయన తనిఖీ చేశారు. ఇందులో భాగంగానే లబ్ధిదారులతో అడిగి తెలుసుకున్నారు. ఆలమూరు లే అవుట్‌లో మొత్తం ఎన్ని ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి?, ప్రస్తుత నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి? ఎప్పటిలోపు చివరి దశకు చేరుకుంటాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల పురోగతితోనే దేశాభివృద్ధి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

అనంతపురం: పరిశ్రమల పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎస్కేయూ కామర్స్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే. మద్దిలేటి రచించిన 'చిన్న పరిశ్రమల అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ యొక్క పాత్ర' అనే అంశంపై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. చిన్న పరిశ్రమల స్థాపన, అభివృద్ధి, ఉపాధి కల్పన, పెట్టుబడుల కల్పనలో ఏపీ రాష్ట్ర ఆర్థిక సంస్థ ప్రాముఖ్యతపై ఈ పుస్తకంలో విపులంగా వివరించారని వీసీ పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు దోహదపడే రీతిలో పుస్తకాన్ని రచించిన డాక్టర్ మద్దిలేటి కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ. మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాలుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నలుగురు సీఐలకు స్థానచలనం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలోని నలుగురు సీఐలకు స్థానచలనం కలిగింది. జిల్లా ఎస్పీ వద్ద వీఆర్‌లో ఉన్న జాకీర్ హుస్సేన్‌ను జిల్లా స్పెషల్ బ్రాంచి విభాగానికి బదిలీ చేయగా...ఎస్‌బీ సీఐగా పని చేస్తున్న చక్రవర్తిని వీ.ఆర్‌కు పంపారు. అనంతపురం వన్‌టౌన్ సీఐ రవిశంకర్‌రెడ్డిని చిత్తూరు వెస్ట్ సీఐగా బదిలీ చేశారు. స్థానిక పీటీసీలో సీఐగా పని చేస్తున్న రెడ్డెప్పను అనంతపురం వన్‌టౌన్ కు బదిలీ చేశారు. ఈ మేరకు బదిలీ ఉత్తర్వులను అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి జారీ చేశారు.

జిల్లా కేంద్రం వీడని జాకీర్

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం పని చేస్తున్న సీఐల్లో చాలా మంది అనంతపురం చూడని వారున్నారంటే అతిశయోక్తికాదు. అయితే సీఐ జాకీర్ హుస్సేన్ మాత్రం ఏళ్ల తరబడి జిల్లా కేంద్రంలోనే పాగా వేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జాకీర్‌హుస్సేన్ అనంతపురం వన్‌టౌన్ ఎస్ఐగా పనిచేశారు. అనంతరం కొంత కాలం లూప్‌లైన్‌లో పని చేసి తిరిగి టూటౌన్ సీఐగా పదోన్నతి పొందారు. తర్వాత అక్కడి నుంచి కిలోమీటరు దూరం కూడా లేని నాల్గో పట్టణ సీఐగా బదిలీ అయ్యారు. అక్కడి నుంచి వీఆర్‌కు వెళ్లగా.. పట్టుమని పది రోజులు కూడా గడవకముందే ఎస్‌బీకి బదిలీ కావడం పోలీసు శాఖలో చర్చనీయాంశమైంది. తామేం పాపం చేశామని జిల్లా కేంద్రంలో పనిచేసే అవకాశాన్ని ఉన్నతాధికారులు ఇవ్వడంలేదో అర్థం కావడం లేదని పలువురు సీఐలు బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా జాకీర్‌హుస్సేన్ నాల్గవ పట్టణ సీఐగా ఉన్న సమయంలో ఆయన పనితీరు బాగలేదనే ఉన్నతాధికారులు వీఆర్‌లో పెట్టారు. అలాంటిది తిరిగి ఎస్‌బీలాంటి కీలక విభాగానికి ఆయన్ను తీసుకోవడం ఏంటని తోటి సీఐలే విమర్శిస్తున్నారు.

టీడీపీకి మైనార్టీ నేత హబీబుల్లా రాజీనామా



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మైనార్టీ నేత, ప్రముఖ న్యాయవాది, టీడీపీ మాజీ జిల్లా అధికార ప్రతినిధి బాకే హబీబుల్లా తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం ఆయన పార్టీ అధినేత నారా చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. అనంతరం మీడియా ముందు లేఖ సారాంశాన్ని వివరించారు. "మీరు ప్రకటించిన మేనిఫెస్టోలో ముస్లిం మైనార్టీల భవిష్యత్తుకు, రక్షణకు ఎలాంటి భరోసా కల్పించకపోవడం శోచనీయం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలలో ముస్లిం మైనార్టీలపైన మతతత్వవాదులు పలు విధాలుగా జరుపుతున్న దాడులను మీరు ఇప్పటి వరకు ఖండించకపోవడం బాధాకరం. ఒక బాధ్యత గల ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు అన్నివిధాలా రక్షణ కల్పించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ముస్లింలకు రాజకీయంగా మంచి ప్రాధాన్యత ఇచ్చారు. అందువల్లే రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలంతా జగన్ వెంటే ఉన్నారు. వారి అభిప్రాయాన్ని గౌరవించి నేనూ జగన్ వెంటనే నడవాలని నిర్ణయించుకున్నా'. అని లేఖలో రాసినట్లు వెల్లడించారు.

త్వరలోనే పంచాయతీ కార్యదర్శులకు స్థానచలనం

అనంతపురం రూరల్: ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న 14 మంది ఈఓఆర్డీలకు, 62 మంది పంచాయతీ కార్యదర్శులకు స్థాన చలనం కలగనుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారితో పాటు ఇతర కారణాల వల్ల బదిలీకి దరఖాస్తు చేసుకున్న 14 మంది ఈఓఆర్డీలకు, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు 8 మంది, గ్రేడ్-2 ఇద్దరు, గ్రేడ్-3 19 మంది, గ్రేడ్ -4 33 మంది పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు తెలిపారు.

భూవ్యవహారంలో ఘర్షణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగర శివారుల్లోని కళ్యాణదుర్గం రోడ్డు సమీపంలో భూ తగాదా విషయంలో ఇరు కుటుంబాల సభ్యులు ఘర్షణ పడ్డారు. భూ తగాదా వ్యవహారంలో నరసింహనాయుడు, రాము, కృష్ణవేణిపై రవికుమార్ అనే వ్యక్తి గురువారం రాళ్లతో దాడి చేశారు. వారు కూడా ప్రతిదాడికి దిగడంతో ఇరు కుటుంబాలకు చెందిన వారికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు స్పందించి 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కార్ల ఢీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగర శివారుల్లోని 44వ జాతీయ రహదారి కక్కలపల్లి కాలనీ సర్వీసు రోడ్డులో గురువారం ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి మరోకారు ఢీ కొనడంతో అందులో ప్రయాణిస్తున్న వారు తీవ్రంగా గాయపడ్డారు. వెనుక కారులో ఉన్న డ్రైవర్ మద్యం సేవించి ఉండటంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఈ వ్యవహారంలో మాటామాటా పెరగడంతో రెండు వాహనాల్లో ఉన్న వారు పరస్పరం దాడి చేసుకున్నారు. గాయపడిన వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారికి సర్దిచెప్పి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

● ఉదయం ఎండ... సాయంత్రం వాన



నగరంలో ఎండ దంచికొట్టింది. గురువారం 40కి పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం అల్లాడిపోయారు. మధ్యాహ్నం నగర వీధులన్నీ బోసి పోయాయి. ఇదిలా ఉంటే సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో నగరం చల్లబడగా ప్రజలకు ఉపశమనం లభించింది.

– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం

వృద్ధాప్య సహాయ నిధికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఈనెలాఖరులోగా వృద్ధాప్య సహాయనిధికి దరఖాస్తులు విజయవాడ ప్రధాన కార్యాలయానికి పంపాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రామిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. సంఘంలో 5 సంవత్సరాలు సభ్యత్వం కలిగి ఉండి, 61 సంవత్సరాలు పూర్తయి భద్రతా పథకంలో సభ్యులుగా ఉన్న వారు అర్హులన్నారు. దరఖాస్తులు అనంతపురం డిపోలో ఉచితంగా అందజేస్తామన్నారు.

ఆడిట్ శాఖలో ఆగిన బదిలీల ప్రక్రియ

అనంతపురం సిటీ: రాష్ట్ర ఆడిట్ శాఖ కర్నూలు రీజియన్‌లో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గురువారానికి కూడా కొలిక్కి రాలేదు. మే 30లోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే ఆడిట్ శాఖలో మాత్రం మిగిలిన రీజియన్లలో బదిలీలు పూర్తయినా కర్నూలు రీజియన్‌లో మాత్రం పెండింగ్ పడటంపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రీజనల్ అధికారులు బదిలీలకు అర్హులైన వారి జాబితా సిద్ధం చేసినా.. రాష్ట్ర స్థాయిలో ఓ అధికారి అడ్డుపడుతున్నట్లు ఆ శాఖ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి మే 30లోగా బదిలీలు పూర్తి కావాల్సి ఉందని, జూన్ ఒకటో తేదీ రాత్రికి కూడా బదిలీల జాబితా ప్రకటించకపోవడంపై అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇదే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు ఆడిట్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు తెలిపారు.